# గుండె ఆగిన క్షణం

సుందరనగరం స్టేషను అంత పెద్దదీకాదు, మరీ చిన్నదీకాదు. ఉదయం వచ్చే మెయిలు ఆగదు. మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ ఆగుతుంది. సాయంకాలం జనతా వస్తుంది. తెల్లవారుఝామున ఏ మూడింటికో ప్యాసింజ రొస్తుంది. జనతాకి తప్పితే ప్యాసింజరుకి రద్దీ ఉంటుంది. సుందరనగరం తిరణాళ్ళప్పుడు రద్దీ చెప్పనక్కర్లేదు.

రాత్రి వొంటిగంట. అక్కడక్కడ రెండోమూడో దీపాలు మినుకుమినుకు మంటున్నై. ప్రయాణీకులు ఇద్దరో ముగ్గురో ఉంటే, పోలీసుబలగం మట్టుకు ఆ స్టేషను కనీవినీ ఎరగనంత జాస్తిగా ఉంది. ఎక్కడా చప్పుడులేదు. తుపాకీల్తో పోలీసులు అడుగుల్లో అడుగులువేస్తూ ఇటూ అటూ తిరుగుతున్నారు.

ఆ సాయంకాలం స్టేషను మాస్టరుకి ఫోనులో పిలుపొచ్చింది.

"అర్ధరాత్రి వస్తున్నాను. కలక్షను అంతా పెట్టెలో పెట్టి, జాగ్రత్తగా అందివ్వపోతివా, ప్రాణాలు దక్కవు. పోలీసు కాపలా తెప్పించుకోడానికి వ్యవధి లేదని విచారించకు, జాగ్రత్త..."

ఫోను 'కట్' అయిపోయింది.

స్టేషనుమాస్టరు చురుకైనవాడు. స్టేషనులో ఉన్న ఇద్దరు పోలీసుజవాన్లు చాలరు. వెంటనే ఊళ్లోనుంచి బలగాన్నంతా రప్పించాడు. ఆయన గుండె తీవ్రంగా కొట్టుకుంటున్నది. అప్పటికి నాలుగురోజులై కలక్షను బ్యాంకులో వేయటానికి కొన్ని ఆటంకాలొచ్చినై. దానికితోడు ఖర్చులూ, జీతాలనిమిత్తం పెద్దమొత్తం వచ్చిపడింది. తిరణాళ్ళవల్ల డబ్బెక్కువ వచ్చింది. పెట్టెలో దాదాపు రెండుమూడు లక్షలు అవలీలగా ఉంటై.

డబ్బున్న పెట్టెను స్టేషనుమాస్టరు తన గదిలోనే పెట్టుకుని, పక్కనే కూర్చున్నాడు. చుట్టూ డజనుమంది పోలీసులు తుపాకులతో కాపలాకాస్తున్నారు. అతని గుండె మెయిలుచప్పుడుకన్నా వేగంగా కొట్లాడుకుంటున్నది.

మూడోతరగతి ప్రయాణీకుల పెద్దులో దాదా పెవరూ లేరు. ఒక మూలగా ఒక ముసలాయన కునికిపాట్లు పడుతున్నాడు. అతనికి దగ్గర్లోనే పూర్తిగా ముసుగు వేసుకొని ఒక వ్యక్తి గాఢనిద్రలో ఉన్నట్టుగా కనపడ్డది.

"శేఖర్"

ఒక పోలీసుజవాను అటుగా వచ్చాడు.

"ఏయ్! ఎవరు నువ్వు?"

ముసలాయన ఆపులించాడు.

"ప్యాసింజరుకోసం చూస్తున్నాం నాయనా? గంటన్నర లేటట. ఎప్పుడూ లేచే. మా ఊళ్లో అది తప్ప మరో బండి ఆగదు. పాడుగోల! కోడల్ని ఇంటికి తీసుకుపోతున్నా. ఏం చేసేది? ఈ ముసలికాలానికూడా చాకిరీ తప్పదు కదా! వాడేమో ఊళ్లో లేడాయె .."

"ముఖంమీద కప్పు తీయి!"

"ఏం టట్టా ఖసురుకుంటావ్?" అంటూ ముసలాయన పడుకున్న వ్యక్తిని తట్టాడు.

ఆమె తుళ్ళిపడి, తలమీద కప్పు తొలగించింది. పోలీసు బ్యాటరీలైటువేశాడు. అంత నిద్రలోనూ కళకళలాడుతున్న అందమైన ముఖం.

పోలీసు ఒకసారి నవ్వుకొని వెళ్ళిపోయాడు.

తెల్లవారుతూందనగా అయిదింటికి ప్యాసింజరొచ్చింది. ముసలాడూ, అతని "కోడలూ" రైలెక్కడం, వెళ్ళడం, పోలీసు గమనించి, అప్రయత్నంగానే పెద్ద నిట్టూర్పు విడిచాడు.

అతనేకాదు. స్టేషనులోఉన్న జవాన్లందరూ, స్టేషనుమాస్టరూ కూడా "హమ్మయ్య!" అనుకున్నారు.

ఎందుకంటే, రాత్రి ఫోనులో నోటీసిచ్చిన "దొంగ"కాస్తా పత్తాలేదు. డబ్బంతా సురక్షితంగానే ఉంది.

ఆరోజు సాయంకాలం స్టేషను మాస్టరుకి మళ్ళా ఫోనువచ్చింది అదే సమయానికి. అతగాడిగుండె పీచు పీచుమంది.

"క్షమించండి. మాకోడలి వొంటిమీద పాతికవేల రూపాయల నగలున్నై, రాత్రంతా స్టేషనులోనే పడిఉండాలి. కోడల్ని ఇంటికి తీసుకెళ్ళాలి, కాపలా ఎట్లాగోతెలీక మిమ్మల్ని ఇబ్బందిపెట్టాను. మీడబ్బు కాపాడుకోవడంతోబాటు, మాకోడలి నగలూ కాపాడారు. మమ్మల్ని పలకరించి, మాక్షేమం కనుక్కున్న పోలీసు జవాన్లకు ధన్యవాదాలు చెప్పండి —"

ఫోను మళ్ళీ "కట్" అయింది.

స్టేషనుమాస్టరు గుండె ఒక్క క్షణంపాటు నిజంగానే కొట్టుకోడం మానేసింది.